
# యోగదర్శనం



జాన్సన్ దంపతులకి భారతదేశం అన్నా భారతీయ తత్త్వవేద శాస్త్రాలన్నా ఎంతో గౌరవం. యోగశాస్త్రం అంటే ఇంక చెప్పనే అక్కరలేదు. వారు స్వదేశమైన అమెరికాలో యోగాభ్యాసం చేసేవారు కూడా! ఎన్నో విధాలుగా విశిష్టమైన విజ్ఞానాన్ని ప్రపంచానికి అందించిన భారతదేశాన్ని సందర్శించాలని వారికి ఎంతో కోరికగా ఉండేది.

ఆ కోరిక ఫలించి వారు భారతదేశానికి వచ్చారు.

దేశంలో అనేక ముఖ్యమైన ప్రదేశాలు చూసుకుంటూ విజయవాడకు వచ్చారు జాన్సన్ దంపతులు. ఆ నగరంలో ఒక పోష్ హోటల్లో బస చేశారు.

వారు అక్కడికి వచ్చేసరికి చీకటి పడింది. కాసేపు విశ్రాంతి తీసుకుని భోజనం చేశారు.

ఆరోజు అంతస్తు కిటికీలోంచి చూస్తూంటే నగరంలోని రంగురంగుల దీపాలు ఎంతో అందంగా కనిపిస్తున్నాయి. అయితే... అటువంటివేవీ వారికి కొత్తకాకపోవటంతో, అవి వారిని ప్రత్యేకంగా ఆకర్షించలేదు. అవతలివైపు కిటికీలోనుంచి చూస్తుంటే ఓ రెండు ఫర్లాంగుల దూరంలో కృష్ణానది కనిపిస్తోంది. ఆ వెన్నెలరాత్రిలో నదిలో నీళ్ల తెల్లగా పాదరసంలాగా మెరుస్తూ వింత అందాలు కన్పిస్తున్నాయి. అలసిపోయి ఉండడంతో ఆరాత్రికి వారు ఆదమరచి నిద్రపోయారు.

తెల్లవారింది.

ముందుగా మిసెస్ జాన్సన్ నిద్రలేచింది. ప్రొద్దున్నే లేచి కొన్ని యోగాసనాలు వేయడం ఆమెకి అలవాటు. కాబట్టి వెల్తురు బాగా వస్తుందని ఆమెవైపు చెందివున్న కిటికీని తెరిచింది. నది ఒడ్డున కనిపించిన దృశ్యం చూసేసరికి ఆమెకి ముచ్చటవేసింది.

"ఆహా- ఈ భారతదేశంలో సామాన్యప్రజలు కూడా ఎంతటి యోగవిద్యాభిమానులు! ఇంతటి చలిని కూడా లెక్కచేయకుండా నది ఒడ్డున కూర్చుని ఎలా యోగాభ్యాసం చేస్తున్నారో!" అని ఆశ్చర్యపోయింది.

వెంటనే మిస్టర్ జాన్సన్‌ని నిద్రలేపింది.

ఒళ్ళు విరుచుకుంటూ లేచి, ప్రశ్నార్థకంగా చూశాడు ఆయన.

"చూడండి, భారతీయులు చలిలో కూడా ఎలా ఆరుబయట యోగాభ్యాసం చేస్తున్నారో!" అంటూ ఆ వైపుగా చూపింది మిసెస్ జాన్సన్.

ఆసక్తిగా అటువైపు చూశాడు మిస్టర్ జాన్సన్.

దృశ్యం స్పష్టంగా కనిపించడం కోసం బైనాక్యులర్స్ తీసి అందులోనుంచి చూశాడు. చూస్తూనే కొయ్యబారిపోయాడు.

ఆయన ముఖంలోని మార్పుని గమనించి, అదేమిటో తాను కూడా చూడాలని బైనాక్యులర్స్‌ని భర్త చేతిలోనుంచి తీసుకొని చూసింది మిసెస్ జాన్సన్.

"మైగాడ్..!! ఇదా వీళ్ళు చేస్తున్న పని? ఫిల్దీ ఫెలోస్..!" అంటూ ధడాలున కిటికీ తలుపులు మూసేసింది.

- జయశ్రీ మాస పత్రిక... జనవరి '88